# తెరలు తొలిగాయి

వాకిలి తలుపు తెరిచిపెట్టి పుష్ప చాపమీద కూర్చుంది గుమ్మం వైపు చూస్తూ.

"సాయంత్రము ఆరుగంటలు కావచ్చింది. నీవు పనిలోమునిగి ఉంటావనుకుంటూ వస్తున్నాం. ఇలా తీరిగ్గా కూర్చున్నావేం?" అన్నపూర్ణ, హేమ చెప్పులు విడిచి చాపమీద కూర్చున్నారు.

''ఆయన బేంకునుంచి వచ్చి 'లా' కాలేజికి వెళ్ళారు. ఎనిమిది గంటలకు గాని రారు."

"ఇదెప్పటినుంచీ? మళ్ళీ ఏంచదువుతాడట?"

"లా చదువుతారట. అందులో చేరారు."

హేమ కళ్ళతో ఆ రెండు గదులఇంటినీ పరిశీలనగా చూస్తోంది.

"పుష్పా! గ్లాసెడు మంచినీళ్ళియమ్మా" అన్నపూర్ణ అలిసిపోయినట్టుగా ముఖం పెట్టింది.

లోపలికివెళ్ళి కూజాలోనుంచి గ్లాసులోకి ఒంపి మంచినీళ్ళు తెచ్చియిచ్చింది.

"ఈ కాలంలోకూడా కూజాలో నీళ్ళు తాగుతున్నారా మీరు?" అన్నపూర్ణ చల్లటినీళ్ళు తాగలేక అవస్థపడ్డది.

''ఏం పుష్పా! ఎలాఉంది కాపురం? వంట వచ్చినదానవు కొత్తకొత్త రకాల వంటలు చేసిపెడుతున్నావా మీ అయనకు?" హేమ అడిగింది.

పుష్ప నవ్వింది పేలవంగా.

"మాకు మీ యిల్లు చూపించవా? నీవు పనిమంతురాలివని వనజ చెప్పింది. ఇల్లంతా ఎలా సర్దుకున్నావో చూపించు'' అన్నపూర్ణ లేచి నిలబడ్డది.

రెండు చిన్న చిన్న గదులూ వాటి ముందర గ్రిల్సుఉన్న వరెండా, ఒక గదిపక్కన బాత్‌రూమ్, దాని పక్కన రెండుగజాల స్థలంలో ఒక నీళ్ళపంపు ఉన్నాయి. చుట్టూ గోడఉంది కనుక భయమంతగా లేదు. ఇల్లు చూడటానికి ముచ్చటగా ఉంది. కాని, అంతా ఖాళీగాఉంది.

"మేము రాగానే పుష్ప వేడి వేడి టీ చేసి ఇస్తుందనుకున్నాము. ఇంట్లో గిన్నెలు, గ్లాసులు, స్టౌ, ఏమీ కనబడ లేదు'' ఇద్దరూ ఒక్కసారే అన్నారు.

''ఇంకా వంట మొదలుపెట్టలేదు. టిఫిన్‌కారియర్ భోజనం, ఫ్లాస్కులో కాఫీ, పొట్లాలల్లో టిఫిను అలా కాలక్షేపం జరిగిపోతోంది" పుష్ప రంగువేసుకున్న గోళ్ళను చూసుకుంటూ అన్నది తలవంచుకుని.

"అంటే రాజే హోటల్నుంచి తెస్తున్నాడా ? లేక, నీవే తెమ్మన్నావా ?" అన్నపూర్ణ ఆశ్చర్యపడ్డది.

"రాజే తెస్తున్నాడు."

"హోటల్‌నుంచి భోజనం రాజు తేవటమేమిటి ? నీవేంచేస్తున్నావు ? వనజ గారింట్లో ఎంతబాగా వంటచేసేదానివి! ఎన్నిరకాలు చేసేదానివి? ఆమెను చెయ్య నివ్వకుండా నీవే చేసేదానివట ? ఇక్కడ రెండుపూటలా హోటల్ భోజనం చేస్తూ చాపమీద కూర్చుని పగటికలలు కంటున్నావా?" అన్నపూర్ణ మందలిస్తుంటే హేమ నవ్వటం మొదలుపెట్టింది.

పుష్ప తెల్లముఖంపెట్టుకుని చూస్తోంది. ఏమంటుంది ? వాళ్ళిద్దరూ ఆమెకు లెక్చెరర్లు. కోప్పడి పాఠం చెప్పినవాళ్ళు. తనను అన్నివిధాలా ఆదుకున్న వాళ్లు.

పుష్ప తల్లీదండ్రీ లేని పిల్ల. అక్క దగ్గర ఉండి చదువుకుంటోంది. వచ్చిన నాలుగు నెలలు సరిగా చూడగలిగింది అక్క. ఆ తరువాత విసుక్కోవటం మొదలుపెట్టింది. నెలనెలా ఫీజుకట్టటానికి డబ్బుయిచ్చేది కాదు. ఒంటికి సరియైన బట్టలు కొనిచ్చేది కాదు, పుస్తకాలకు డబ్బులేదనేది. ఇంట్లో అనాదరణ, స్కూల్లో తోటిపిల్లల హేళన, పుష్పను దిక్కులేనిదానిగా చేశాయి.

ఆ స్కూలు ప్రిన్సిపల్‌కి వనజతో బాగా పరిచయమయిన కారణం పుష్ప నెల నెలా ఫీజు కట్టలేకపోవటమే.

''అమ్మాయి చురుకైనపిల్ల. ఇంట్లో ఏవో ఇబ్బందులు ఉన్నట్టున్నాయి. ఆ అమ్మాయికి నీవేదయినా సహాయం చెయ్యరాదూ ? మీకాలేజిలో ఎంతమందికో సహాయం చేస్తావని అందరూ అంటారు. పాపం, కట్టుకోవటానికి బట్టలు కూడా సరిగా లేవు. ఈ సంవత్సరమయితే పదోక్లాసయిపోతుంది. తరువాత చూద్దాం"అని ఒకనాడు వాళ్ళింటికివెళ్ళి చెప్పింది ప్రిన్సిపల్.

వనజది జాలిగుండె.

ఫీజుకూ పుస్తకాలకూ కావలసిన డబ్బు ప్రిన్సిపల్‌కి ఇచ్చింది.

ఆ మరునాడే అక్క అడిగింది ''ఎక్కడివే నీకీపుస్తకాలు ?" అంటూ దూకుడుగా.

"ఇవి స్కూలు పుస్తకాలక్కా. ప్రిన్సిపల్ ఇచ్చింది చదువుకుని తెచ్చి యివ్వమని."

"అయితే అడుక్కోవటం మొదలుపెట్టావన్నమాట ? మా యింట్లో ఉండి అడుక్కోవటం యెందుకు ? మాకు అప్రతిష్ఠ. ఊరికెళ్ళి బాబాయిగారింట్లో ఉండు. పో, రేపే రైలెక్కిస్తాను, అక్కడే అడుక్కుతిందువుగాని."

''బాబాయి, చదువుకీ పెళ్ళికీ నాన్న దాచిపెట్టిన డబ్బు నీకే యిచ్చాడుగా అక్కా. ఇప్పుడువెళ్తే ఏమనుకుంటాడు ?"

''పదహారేళ్ళ పిల్లవు, నీకే ఇంత తెలిసిఉంటే నాకేనాలేంది ? ఆయన ఇచ్చిన డబ్బు ఒక్క ఏడాదికయినా సరిపోలేదు. నీవు వాళ్ళింటికే వెళ్తావో, ఇక్కడే ఉండి అడుక్కుతింటావో నాకనవసరం. ఈ యింట్లో నీవు ఉండటానికి మాత్రం వీల్లేదు" కచ్చితంగా అంది.

స్కూలుకు వెళ్ళగానే సరాసరి ప్రిన్సిపల్ గదిలోకి వెళ్ళి తన పరిస్థితంతా చెప్పుకుని ఏడ్చింది. ప్రిన్సిపల్ పిల్లలతల్లి, ఎవరు ఏడ్చినా ఆమెకు తన పిల్లలు ఏడ్చినట్టే ఉంటుంది.

ఆమె దిగ్గున లేచి ఒక ఆడనౌకరును పిలిచి. పుష్పకు హోటల్నుంచి ఇడ్లీ కాఫీ తెప్పించిపెట్టింది.

"పుష్పా, నీవు క్లాసులోకి వెళ్ళు. మధ్యాహ్నం ఇంటర్వల్లో ఇక్కడికి

వచ్చెయ్, నేను వనజగారికి చెప్పి ఏదో ఏర్పాటు చేస్తాను. దిగులుపడకు" సర్దిచెప్పి పంపించింది.

ప్రిన్సిపల్ దగ్గర్నించి కాలేజికి ఫోనురాగానే వనజ అందుకుంది. పుష్ప సంగతంతా విని సాయంత్రానికి తన యింటికి పంపించమని చెప్పింది. వనజ తోటి లెక్చెరర్లు హేమ, అన్నపూర్ణలు. వాళ్ళకు ఈ సంగతి చెప్పి "మనం ముగ్గురం ఆ అమ్మాయిని పెంచుకుందాము. మాయింట్లో ఉంచుకుంటాను. మాతో పాటు భోజనం చేస్తుంది. బట్టలు కొన్ని నేనిస్తాను. మీరు కూడా ఆ అమ్మాయిని ఆదుకోండి. ఒకరు ఫీజు కట్టండి, ఒకరు ఒకజత బట్టలు కొనియివ్వండి. మీరు కాదూ అంటే అంతా నేనే ఇస్తాను. పదహారేళ్ళ ఆడపిల్ల కడుపునిండా తిండిలేక, ఒంటినిండా బట్టలేక అంత హీనస్థితిలో ఉంటే మనం చూస్తూ ఊరుకోవటం మానవత్వం కాదు. ఏమంటారు?'' అంది వాళ్ళ ముఖాలుచూస్తూ.

ఇద్దరూ మాట్లాడకుండా ఒప్పుకున్నారు.

పుష్ప వనజయింట్లో వారంరోజులకే ఇంటిమనిషిగా మారిపోయింది. రాత్రిళ్ళు హాలు పక్కగా ఉన్న చిన్నగదిలో చదువుకుంటుంది. తెల్లవారి లేవ గానే, బేబీరోజీకి ముఖం కడిగించి, స్నానంచేయిస్తుంది. పాలు తాగించి ఆమ్లెట్ తినిపిస్తుంది. తను స్నానంచేసి, "ఆంటీ, నేను వంటయింటిపని చూస్తాను. మీరు అంకుల్‌కి కాఫీ టిఫిన్ ఇచ్చి స్నానం చెయ్యండి'' అంటూ ఆమె చేతిలోనుంచి గిన్నెలాక్కుంటుంది. ఇంటికి రాగానే బట్టలు మార్చుకుని మడతచేసి పెట్టుకుం టుంది. రాత్రిళ్ళు బేబీని చూసుకునే కోటమ్మను తనదగ్గరే పడుకోమంటుంది తనకు భయం పుట్టకుండా.

ఆ యింటికి వచ్చిన వారంరోజులు సరిగా చదవలేకపోయినా, తరువాత బాగా చదివింది. స్కూలుకు ఫస్టువచ్చింది ఆ సంవత్సరం పదవక్లాసులో.

ముగ్గురమ్మలూ కలిసి తమ కాలేజిలోనే చేర్పించారు. ఆ ముగ్గురికీ ముద్దు బిడ్డగా మసులుకుంటూ బి.ఏ పరీక్షరాసింది పుష్ప.

సాయంత్రం ఆరుగంటలవేళ అన్నపూర్ణ, హేమ వనజ యింటికి వచ్చి పెరట్లో అరుగుమీద కూర్చుని మాట్లాడుకుంటున్నారు. పుష్ప వాళ్ళకు కాఫీతీసుకు వచ్చి ఇచ్చింది. దోసెలు వెయ్యటానికి వంటయింట్లోకి వెళ్ళింది.

''బి.ఏ. అయిన తరువాత పుష్పను ఏంచేద్దామంటారు?" వనజ వాళ్ళను సలహా అడిగింది.

"మన కాలేజిలో ఏదయినా పోస్టింగ్ ఉందేమో కనుక్కుంటే?" హేమ అన్నపూర్ణ ముఖంలోకి చూసింది.

"క్లార్కుగానేగా ఏదయినా ఉంటే? మొన్ననే ఒక అమ్మాయి టైపిస్టట-చేరింది'' అన్నపూర్ణ సమాధానమిచ్చింది.

"అయితే ఏంచేద్దాం?''

ముగ్గురూ ఆలోచిస్తున్నారు.

శేఖర్ ఇంటికి వచ్చాడు ఆఫీనుంచి. రోజీనెత్తుకుని వనజకోసం ఇల్లంతా తిరగుతూ పెరట్లోకి వచ్చి "ఇక్కడ మీటింగు జరుగుతోందా? లోపలికొచ్చి కూర్చోండి" అంటూ భోజనాల బల్లముందర కూర్చున్నాడు. పుష్ప కాఫీ టిఫిన్ తెచ్చిపెట్టింది. రోజీతో కబుర్లుచెబుతూ కాఫీ టిఫిన్ ముగించి, పెరట్లోకి వెళ్ళి తనుకూడా వాళ్ళతో కలిశాడు.

''సంగతేమిటో నాక్కూడా కాస్త చెప్పండి. నేనూ ఆలోచిస్తాను"అన్నాడు నవ్వుతూ.

''మన పుష్పను గురించేనండీ ఆలోచన. బి.ఏ. అయిన తరువాత ఏం చెయ్యాలని" వనజ బయటపెట్టింది.

"చదివించాలంటే ఎం.ఎ లో చేర్పించండి. పెళ్ళిచేయాలంటే చేసెయ్యండి. అందరం కలిసి చేసేద్దాం దానికి ఆలోచన ఎందుకు ఇంతగా?'' అన్నాడు.

"పెళ్ళికొడుకు అమ్మాయికి ఈడైనవాడు, కట్నం లేకుండా అమ్మాయి అందాన్నీ, చదువునూ చూసి చేసుకునేవాడు, కుదరద్దూ? పెళ్ళికొడుకు దొరకటమంటే మాటలా?" అన్నారు అన్నపూర్ణ, హేమ.

''ఏం కష్టంలేదు. మా ఆఫీసులో ఒక క్లార్కున్నాడు. మొన్ననే అతడికి యు.డి.సి గా ప్రమోషను వచ్చింది. పిల్లవాడు అందంగా ఉంటాడు. పేరు రాజు. బుద్ధిమంతుడు, అతడికి అయినవాళ్ళు ఎవరూ లేరు, డబ్బాశ లేదు. నేను చెప్పి

నట్టు వింటాడన్న నమ్మకముంది. ఒక రోజు ఇంటికి తీసుకొచ్చి చూపించమంటే తీసుకువస్తాను'' అన్నాడు.

''ఇంకా ఏంకావాలి ? అబ్బాయిని తీసుకురండి" అన్నారు ముగ్గురూ ఆతురతతో.

అనాడే పుష్ప ఫస్టుక్లాసులో ప్యాసయినట్టు రిజల్ట్సు పేపర్లో వచ్చాయి. పుష్పను తలంటి పోసుకొమ్మని కొత్తచీరె వనజ కట్టబెట్టింది. అనాడే శేఖర్ రాజును యింటికి తీసుకువచ్చాడు. కబురుచెయ్యగానే హేమ, అన్నపూర్ణ వచ్చారు.

అందరికీ వనజ కాఫీ టిఫిన్లు అందించింది. డైనింగ్ టేబుల్ దగ్గరే పెళ్ళి చూపులయ్యాయి, మాటలు కలిశాయి.

రాజు వెళ్ళగానే అందరూ అతడిని పెళ్ళికొడుకుగా నిశ్చయించారు. పుష్ప కూడా తనకు నచ్చినట్టుగా తలఊపింది. రాజు సంగతి ఆఫీసులోనే తేల్చేశాడు శేఖర్.

రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్ళి రిజిస్టరయింది. దేవుడిగుడిలో మంగళసూత్ర ధారణ జరిగింది. స్నేహితులనూ ఆఫీసువాళ్ళనూపిలిచి విందుచేశాడు శేఖర్ సరదాపడుతూ.

పెళ్ళికివచ్చిన బహుమానాలతో తాము కొనిచ్చిన చీరెలు బ్లౌజులతో, రాజు యింటికి, పుష్పను తీసుకువచ్చి, దిగబెట్టివెళ్ళారు ముగ్గురమ్మలు. రాజూ పుష్ప వాకిటవరకూ సాగనంపారు వాళ్లను.

వారం రోజులయింది. పుష్ప మళ్ళీ కనబడలేదని హేమ, అన్నపూర్ణ ఒక సెలవురోజున పుష్పను చూడటానికి బయలుదేరారు. అక్కడి పరిస్థితి చూసిన తరువాత ఎక్కువసేపు ఉండబుద్ధికాలేదు. అంత ఆప్యాయంగా మాట్లాడే పుష్ప బలవంతంగా అతికష్టమ్మీద అడిగిన దానికి జవాబివ్వటమే ఆశ్చర్యపరిచింది వాళ్లను. ఇంటికివస్తూ వనజకీ కబురు చెప్పివెళ్ళారు.

మరునాడు వాళ్లు వచ్చినప్పుడు "మనమంతా కలిసి వాళ్ల యింటికి వెళ్దాం సామాన్లుతీసుకుని. వాళ్ల యింట్లోనే మనం వంటచేసి అందరంకలిసి భోజనం చేద్దాం" అంది వనజ.

మూడవనాడు రెండు స్టౌలు, కూరగాయలు పప్పుఉప్పు సామాగ్రి గిన్నెలు విస్తళ్ళుతీసుకుని ఆవకాయ చిన్నసీసాలోపెట్టుకుని ముందుగా రిక్షాలలో మూడు గంటలకుదిగారు. ఆరోజు రాజు ఇంట్లోనేఉన్నాడు సామాన్లతో వచ్చినవాళ్లనుచూసి ఆశ్చర్యపోయాడు.

"ఏంలేదు మీరు విడిగా కాపరంపెట్టిన తరువాత మమ్మల్నందరినీ విందుకు పిలుస్తారనుకున్నాం. మళ్ళీ మీరటు రానేలేదు. అందుకే మేము సామాన్లతోవచ్చి మీకు విందుచేయాలనుకున్నాం. ముగ్గురంకలిసి గంటలో వంటచేస్తాం మావాళ్లు ఒక గంటలోవస్తామన్నారు" అంది వనజ.

రాజు వైపొకసారిచూసి పుష్పలేచింది. నలుగురూకలిసి పదిమందికి వంట చేసే లోపల శేఖర్, అశోక్, విఠల్ పాపనుకూడా తీసుకువచ్చారు.

అందరూ ఇల్లుచూసి ఇద్దరికి చాలా బాగుందని మెచ్చుకున్నారు. "ఎప్పుడు తీసుకున్నావీయింటిని" అడిగారు.

"నేను ఉద్యోగంలో చేరగానే తీసుకున్నాను. కిందటి నెలవరకు నాతో కూడా ఒక స్టూడెంటు ఉండేవాడు. చదువయిపోయింది వెళ్లిపోయాడు.

నలుగురూ కలిసి రాజకీయాలు దేశపరిస్థితులు ఉద్యోగాలనుగురించీ కబుర్లు చెప్పుకున్నారు.

"పాపకు నిద్రవేళయింది. తొందరగా భోజనాలుచేద్దాం లేవండి. విస్తళ్లువేసి వడ్డించాము" వనజ తొందర పెట్టింది.

అందరూ భోజనాలకులేచారు. సరదాగా కబుర్లుచెప్పుకుంటూ వంటకాలను గురించి పొగుడుతున్నారు జోకులు విసురుకుంటూ.

"మీ భోజనాలయితే మావీ అవుతాయి. ఎనిమిదింటికి ఇళ్లకు చేరుకోవాలి" అంది హేమ.

"మేము మాట్లాడకుండా భోజనంచేస్తాం. సరేనా?" అన్నాడు విఠల్-భార్య మాటలకు నవ్వుతూ.

ఆడవాళ్లు నలుగురూ భోజనాలుచేసి అన్నీ సర్దిపెట్టుకుని ఆ స్థలం శుభ్రం చేశారు. బయలుదేరేటప్పుడు అశోక్ అన్నపూర్ణతో సంప్రతించి "మళ్ళీ ఆదివారం

న్నాడు మా యింట్లో భోజనం అందరికీ. ఏవోసాకులుచెప్పి తప్పించుకోకండి" అన్నాడు.

"ఎంతమాట? మీరు పిలిచాక రాకుండా ఉంటామా!" అన్నారు అందరూ.

రెండురోజులు గడిచినతరువాత పుష్ప "నాకు హోటల్నుంచిభోజనం తీసుకు రాకండి" అంది టిఫిన్ కారియర్ తీసుకుని బయలుదేరుతున్న రాజుతో.

"ఏం? ఎందుకని?"

"నాకు నోటికి హితవుగాలేదు. తినలేకపోతున్నాను ఆ కాఫీకూడా వెగటుగా ఉంటోంది. నాకు వద్దు"

"అయితే భోజనంలేకుండా ఎట్లాఉంటావు? పోనీ పాలూ పళ్ళూ తెమ్మ న్నావా?"

"వద్దండి"

"ఏం తినకుండా ఎట్లాఉంటావు? మీ ముగ్గురమ్మలు నన్నేమంటారోతెలుసా? మెచ్చి పెళ్ళిచేసుకున్నాడు గాని తిండి పెట్టక ఎండబెట్టున్నాడంటారు."

"వాళ్లకు చెప్తానా ఏమిటి మనసంగతులన్నీ?"

రాజు పాలూ పళ్లూ తీసుకువచ్చాడు బలవంతంగా పాలుతాగి పళ్లుతిన్నది.

ఆదివారంనాడు."కొంచెం ముందరగావెళ్తే ఆంటీలకు సహాయంచేయ వచ్చు" అంటూ తొందరగా బయలుదేరింది పుష్ప. ఒకగంట తరువాత రాజూ బయలుదేరాడు.

అశోక్ అన్నపూర్ణల ఇల్లు చిన్నదేకాని పొందికగా ఎక్కడ సామాన్లు అక్కడ సర్దిపెట్టి ఉండటంవల్ల విశాలంగా కనబడుతోంది. ఇద్దరు మగపిల్లలు- ఎనిమిది, ఆరేళ్లవాళ్లు, పొద్దున్నేలేచి పాలుతాగి స్నానాలుచేసి పక్కనేఉన్న పార్కులో ఆడుకోటానికి వెళ్లేముందు,

"మీరిద్దరూ చపాతీకూర తిన్నారా ? మళ్ళీ వేళకురండి. అందరూ విందుకు వస్తున్నారు చిన్న చిన్న పనులు చేసిపెట్టాలి" అంది అన్నపూర్ణ. వాళ్ళు తలలూ పుకుంటూ పరుగుతీశారు.

వాళ్ళు ముగ్గురూ పుష్ప కలిసి రెండురకాల స్వీట్సు చేశారు. మసాలా వడలు చేశారు. అన్నపూర్ణ రకరకాల వంటలు చేయటంలో ఆరితేరింది. పది కొండు కాకుండానే వంటలయ్యాయి. వాకిటి వరెండాలో కుర్చీలువేసుకుని విఠల్, రాజు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. అంతలో శేఖర్ వాసు వచ్చారు. పాప గునగున నడుస్తూ ఇల్లంతా తిరిగి మళ్ళీ తండ్రి దగ్గరికొచ్చికూర్చుంది.

''అమ్మేం చేస్తోంది ?" అడిగాడు శేఖర్.

''గారెలు, గారెలు చేస్తోంది నాన్నా'' మళ్ళీ పెరట్లోకి పరుగెత్తింది.

''వీళ్ళను ఇంతకష్టపెట్టి భోజనాలు ఇంట్లో చెయ్యకపోతే ఏం? ఏ హోట ల్లోనో ఆర్డరుచేస్తే సరిపోయేదిగా ? ఇంతచాకిరి వాళ్ళచేత చేయిస్తున్నాం" అన్నాడు సన్నగా రాజు.

''అదేమిటోయ్ అట్లా అంటావు ?"

"వాళ్ళు చాకిరీ చెయ్యటానికే పుట్టారా ? వాళ్ళు నలుగురూ చెమటోడ్చి పని చేయటమూ మనం కూర్చుని తినటమూనా? నాకీ పద్ధతి నచ్చదండీ."

"అయితే ఒకమాట- రాజూ, నీవు ఆఫీసులో పనిచేస్తున్నావు. అది బండ చాకిరీ అనుకుంటూ చేస్తున్నావా? నీవు జీతం తీసుకుని పనిచేస్తున్నావు. ఎందుకు ఉద్యోగం చేస్తున్నావు ? మీ సంసారం కోసం. అట్లాగే వాళ్ళూ ఉద్యోగాలు సంసా రాలకోసమే చేస్తున్నారు. వాళ్ళూ జీతం తీసుకునే చేస్తున్నారు. ఇంటిపని అంటావా? ఎవరికి వీలయింది, ఎవరికి చేతనైంది వాళ్ళు చేస్తారు. మనంగానీ వాళ్ళుగానీ సంపాదించే యంత్రాలని ఎవరికోసమో చేస్తున్నామనీ ఎందుకనుకోవాలి ? ఇద్దరూ సంపాదించటం దేనికి ? కన్నబిడ్డలకోసం కుటుంబం కోసం. ఇద్దరు చెరొకపని చేసుకుంటూ కాపరం చెయ్యాలి. ఆ చెయ్యటం కూడా అన్యోన్యంగా ఒకరికోసం ఒకరు త్యాగంచేస్తూ ఆనందంగా బతకాలి. ఒకరికిష్టమైన పని ఇంకొకరు చేయ టంలో ఎంత ఆనందముందో అనుభవమ్మీదగాని తెలియదు. దాంపత్యం, కాపరం అంటే అది. అంతేకాని మనం ఎవరికోసమో పరాయివాళ్ళ కోసం చేస్తున్నామను కుంటే పెళ్ళెందుకు ? ఎవరికి వారే అనుకుంటే ఒక యింట్లో ఉండటమెందుకు ? విడివిడిగా ఉండి అప్పుడప్పుడు కలుసుకోవచ్చుగా ? ఆ జీవితాలలో ఇంత అన్యోన్యం అనురాగం ఉండటానికి అవకాశాలు తక్కువగా ఉంటాయి."

రాజుకిదంతా అయోమయంగా ఉంది. అతడు ఒంటరిగ్గాడు. హాస్టల్లో ఉండి నా అన్నవాళ్ళు లేక, చదువుకున్నాడు. కో ఎడ్యుకేషన్ కాలేజిలో విద్యార్థినీ విద్యార్థులతో మెలిగాడు. కాలేజీలలో చదివేటప్పుడు బాధ్యత లేని స్వతంత్రభావాలుగల ఆలోచనలతో కాలం గడిచిపోయింది. విఠల్ మాటలకు తన అభిప్రాయాలకూ ధ్రువాంతర భేదముంది. కనుబొమలు ముడిచాడు.

అంతలోనే ఇద్దరు కూలీలచేత ఒక బీరువా పట్టించుకుని వచ్చాడు అశోక్. పిల్లలు తండ్రి రాగానే "నాన్నా ఇది ఎవరికి ?'' అంటూ వెంటబడ్డాడు.

"ఉండండి చెబుతాను కూలీలను పంపించి వస్తాను'' అంటూ కూలీలకు డబ్బిచ్చి పంపించి "శ్రీధర్-శ్రీకాంత్ ఇద్దరూ ఇట్లారండి. ఈ బీరువా మీ ఇద్దరి కోసం. దీనిలో సగం ఒకరికి, ఇంకోసగం ఇంకొకరికి. మీ పుస్తకాలూ, బట్టలూ మీ వస్తువులన్నీ ఇందులో పెట్టుకోవాలి. ఇవాళ నేను సర్దిచూపిస్తాను. రేపటినుంచీ మీ పని మీరు చేసుకోవాలి. బయట మీవస్తువులేవీ ఉండకూడదు" అంటూ వాళ్ళు తెచ్చిపడేసిన పుస్తకాలూ బట్టలూ సర్దిపెట్టి తాళంవేసి ఇద్దరికీ చెరొక తాళంచెవీ ఇచ్చాడు.

"గదిలో మేకుకు తగిలించుకోండి, పారేసుకోకూడదు, ఇద్దరు పోట్లాడుకోకూడదు వింటున్నారా ?'' అంటూ చేతులూ ముఖం కడుక్కొచ్చి శేఖర్ పక్కన కూర్చున్నాడు.

రాజు అశోక్ చెమటలు తుడుచుకుంటుంటే చూశాడు.

''ఏమిటోయ్ అశోక్ ! హాయిగా కూర్చోక ఈ చాకిరీ ఏమిటి ? చెమటలు పోసేటట్టు ?" అన్నాడు రాజు.

అశోక్ నవ్వాడు. ఆ నవ్వులో ఆనందం ఉంది. పిల్లలకోసం కొన్నానన్న తృప్తి ఉంది. వాళ్ళు సంతోషిస్తుంటే తనకెంతో మురిపెంగా ఉంది.

"అదేమిటోయ్ అలా అంటావు ? అది చాకిరి ఎట్లాఅవుతుంది? సంతోషంతో చేసింది చాకిరికాదు. ఎక్స్ప్లాయిటేషన్ అంతకంటె కాదు. వాళ్ళు అడిగింది కొని ఇవ్వటంలో వాళ్ళమీద నాకున్న ప్రేమ వాళ్ళకోసం డబ్బు ఖర్చుచేయటంకూడా ఆ ప్రేమవల్లనే. వాళ్ళు సంతోషిస్తుంటే చూసిన నాకు ఆనందం కలుగుతుంది. ఈ

కష్టమంతాపడి సంపాదించటం ఎవరికోసం ? భార్యా బిడ్డలకోసమే దాని ఫలితం వాళ్ళ ప్రేమాభిమానాలు."

శేఖర్‌కి అనురాగం, ఆప్యాయత, వాటికోసం త్యాగం చెయ్యటం తెలుసు. భార్య మనసు తనకు తెలుసు. తన మనసు ఆమెకు తెలుసు. ఇద్దరిమధ్య పాప ఇద్దరు ఒకరికొకరు సహకరించుకుంటూ, అన్యోన్యంగా కాపురం చేసుకుంటున్నారు. కాని, అశోక్ మాదిరిగా విప్పి వ్యాఖ్యానించటం తెలియదు. ఇద్దరి మాటలూ వింటున్నారు.

"ప్రేమ ఉన్నచోట త్యాగముంటుంది. త్యాగంలేని చోట ప్రేమ ఉండదు. ఉన్నా అది ప్రేమ అనిపించుకోదు" అన్నాడు అశోక్. ఆ ప్రేమ కొంచేరాదు. ఆపేక్ష అందిస్తే పుట్టుకొస్తుంది'' అన్నాడు అక్కడితో ఆగక.

రాజుకు ముల్లుగుచ్చుకున్నట్లయింది.

మళ్ళీ అశోక్ ''ఆ జీవితానికి అర్థమేమిటి ?" అన్నాడు.

అంతలో శ్రీకాంత్, శ్రీధర్ వచ్చి "నాన్నా మేము భోజనం చేశాము. మీకు వడ్డిస్తున్నారు. రమ్మంటున్నారు వెళ్ళండి" అంటూ వీధిలోకి పరుగెత్తారు.

అందరూలేచి విస్తళ్ళముందర కూర్చున్నారు.

"మొదలుపెట్టండి" అన్నాడు అశోక్.

భోజనాలు సగమైపోయిన తరువాత "వంటలు బాగున్నాయి ఎవరుచేశారో గాని" శేఖర్ మసాలవడ తుంచుతూ అన్నాడు.

"మా పూర్ణ ఉన్నచోట మరొకరిని చెయ్యిపెట్టనివ్వదు. అంతా తన చేతి మీదుగా జరగాలంటుంది. ఏమిటో, నాక్కూడా ఆచేతివంట తప్ప ఇంకొకరిది నచ్చదు" అశోక్ మాటలకు అంతా నవ్వారు.

"ఎట్లాగయినా వంటలో వాళ్ళకున్న ప్రావీణ్యం మనకు ఉండదు- ఎవరికో తప్ప. నాకనిపిస్తూ ఉంటుంది- ఈ రుచులన్నీ వాళ్ళు నేర్పినవే మనకు. వాళ్ళే లేకపోతే ఎక్కడతిన్నా, ఎంత సంపాదించినా మనకు తృప్తి అనేది ఉండేది కాదేమో ?" మళ్ళీ అందుకున్నాడు అశోక్.

"బానిస బ్రతుకులు" అనుకున్నాడు రాజు గొణుక్కుంటూ.

"ఏమోయ్ రాజూ, వాళ్ళూ బానిసలు కారు, మేమూకాము. వాళ్ళ స్వాతంత్ర్యాలు వాళ్ళకున్నాయి. మావి మాకున్నాయి. పొరబాటునయినా అట్లా అనుకోకు" అన్నాడు విఠల్.

నలుగురు గృహిణులూ కబుర్లు చెప్పుకుంటూ మధ్య మధ్యలో నవ్వు లొలకపోసుకుంటూ ఉంటే శేఖర్ వాళ్ళకు కావాలసినవి అందిస్తున్నాడు. కొసరి కొసరి వడ్డిస్తున్నాడు.

సాయంత్రము నాలుగు గంటలు కాగానే, "భోజనం బరువై అందరూ ఒక కునుకు తీసినట్టున్నారు. కాఫీ తెచ్చాను, లేవండి" అంటూ కాఫీ కప్పులందించింది వాళ్ళకు పుష్ప.

ఆరుగంటలు కాకముందే అందరూ ఎవరిళ్ళకు వారు చేరుకున్నారు.

ఇంటికి రాగానే పుష్పకు బోసిగా ఉన్న ఇంట్లో చాపలూ దిండ్లూ కనబడ్డాయి. ప్రాణం ఉసూరుమన్నది, మనసు కుంగింది.

ఆ రాత్రికి కూజాలో నీళ్ళు ఒంపుకుని గ్లాసునిండా తాగి పడుకుంది.

రెండురోజుల తరువాత అన్నపూర్ణ, హేమ రవ్వలడ్డూ మిక్చరు పొట్లం కట్టి తీసుకు వచ్చారు పుష్పకోసం. పుష్ప మగతగా చాపమీద పడుకుని ఉంది.

"ఏమిటిలా పడుకున్నావు? జ్వరమా?" ఇద్దరూ ఆదుర్దాతో చెరొకవైపు కూర్చున్నారు. అంతలో వాళ్ళకు మరో సందేహం కలిగింది, నవ్వుకున్నారు.

"జ్వరం లేదు. ఏదయినా వచ్చి ప్రాణంపోయినా బాగుండును" కన్నీళ్ళు కార్చింది పుష్ప

"అంత పెద్ద పెద్ద మాటలంటున్నావు జ్వరం కాకపోతే ఆ నీరసమేమిటి? ఈ మగత ఏమిటి?" హేమ రెట్టించింది

"జ్వరం లేదన్నావు సరే. భోజనం చేశావా? మొన్న మా యింటికి వచ్చి నప్పుడు బాగానే ఉన్నావే? నలుగురితో సరదాగా మాట్లాడావు. వడ్డనకూడా చేశావు" అన్నపూర్ణ అందుకుంది.

వాళ్ళిద్దరూ అట్లా తరచి తరచి అడుగుతూ ఉంటే పుష్ప కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

కొంగుతో ముఖం తుడుచుకుంటూ "నేను వనజ ఆంటీ ఇంట్లో నాలుగేళ్ళకు పైగా ఉన్నాను. ఆ యింటి పరిస్థితుల ప్రభావం నామీద చాలా ఉంది. ఆమెకూడా ఉద్యోగం చేస్తోంది. అంకుల్ కూడా చేస్తున్నారు. ఆయన ఇంటికి వచ్చినప్పటి నుంచీ ఆగదీ ఈగదీ సర్దుతూ ఉంటారు. ఆమె చీరెలు మడతచేసి బీరువాలో సర్దు తారు. రోజీవని చాలావరకూ ఆయనే చేస్తారు. ఇంక ఆంటీ 'ఆయనకిట్లా ఉంటే బాగుంటుంది. ఈ టిఫిన్ చేస్తే ఇష్టంగా తింటారు. ఆయనకు నేనీచీరె కట్టుకుంటే ఇష్టం' అంటూ ఏపని చేసినా ఆ దృష్టితోనే చేస్తుంది. ఆ యింట్లో ఎవరయినా- 'ఈయనకు నేనెందుకు చెయ్యాలని' గాని, 'ఆవిడగారికి నేనెందుకు చెయ్యాలని గాని, 'నా స్వాతంత్ర్యాన్ని నేను వదలుకుంటానా' అని గాని, 'ఈ పిల్ల చాకిరి చెయ్యలేక పోతున్నానని' గాని, 'ఎందుకు చెయ్యాలని' గాని, ఇటువంటి మాట ఒక్కటయినా నేను వినలేదు. వాళ్ళు ఒకరినొకరు గౌరవించుకుంటారు. ప్రేమించు కుంటూ ఒకరికోసం ఒకరు బ్రతుకుతున్నట్టుగా జీవిస్తున్నారు. ఇద్దరూ ఇంటి పనులు చేసుకుంటారు. ఇందులో ఎవరికెవరూ బానిస అన్నమాట నేను వినలేదు. ఎందుకోసమని ? వాళ్ళిద్దరూ కలిసి ప్రేమతో కట్టుకున్న ఆ గూటికోసమని. దాని కోసమే కష్టపడుతున్నారు. అంతేగాని ఏ ఒక్కరికీ మరొకరు డోర్‌మెట్ అన్న భావమే లేదు. ఆయింట్లో ఆయన స్మామ్రాట్, ఆమె సామ్రాజ్ఞి సమాన ప్రతిపత్తి కలవాళ్ళు."

"ఇంత లెక్చెరిచ్చావు ఎవరు కాదన్నారు ? మేమూ వినలేదే ఈ మాటలు?"

"మీరంతా నాకోసం కష్టపడి డబ్బు ఖర్చుపెట్టి చదివించారు. ఈ పెళ్ళి చేశారు. ఎందుకోసం? మీలాగే నేనుకూడా ప్రేమతో గూడు కట్టుకోవాలనీ, ఆగూటి కోసం త్యాగంచెయ్యాలనీ అన్యోన్యంగా కాపురం చెయ్యాలనే కదా ? ఆఫీసునుంచి రాగానే అలసట తీరేటట్టుగా ఆయన కిష్టమనుకున్న టిఫిన్ వేడివేడిగా చేతికిచ్చి ఆయన బాగుందని తింటుంటే నేను సంతోషించాలనేగా ? అలాగే ఆయన నాకోసం ఏపని చేసినా నా మనసెంత ఉప్పొంగుతుంది ? కాని, కాని, ఆయన నాకే అవకా శం యివ్వకుండా బానిస అనీ చాకిరీ అనీ అంటుంటే నామనసు నీరుకారిపో తున్నది. ఎంతసేపటికి మనిషిని కలుపుకుందామన్న ధ్యాసలేదు. పైగా ఆయన

పద్ధతుల వల్ల మామధ్య దూరం పెరుగుతున్నది. నేను ఎం.ఎ. లో చేర్దామనుకుంటున్నాను. అసలు ఈ 'ఎక్కువ తక్కువలు' అన్నమాటలు నన్ను తినేస్తున్నాయి. 'పాలక పాలిత' బాంధవ్యాలేమిటి దాంపత్యంలో ?" పుష్ప మనసులో మసలుతున్న లావాను బయటపెట్టింది కన్నీటితో.

"ఇదంతా నీ తప్పేననిపిస్తున్నది పుష్పా? రాజు మనసు కనిపెట్టి మెల్లగా నీవే నేర్పించాలి-మనసు నొప్పించకుండా. నీవేదో చెప్తున్నట్టుగా అతడు వింటున్నట్టుగా కాకుండా, చేసిచూపించాలి. ఒక్కొక్క భార్యకు ఈ విషమ పరిస్థితి ఎదురౌతుంది. అందరికీ వడ్డించిన విస్తరి దొరుకుతుందా? ఓపికతో వడ్డించుకోవాలి. ఒకోసారి ఒకరికి తెలియకపోతే ఇంకొకరు తెలియచెప్పవచ్చు. వింటే తప్పులేదు. 'ఆయన చెప్పేవాడా? ఆయనచెప్పింది నేను వినాలా?' అనే బింకాలను కాంప్లెక్సులను వదలిపెట్టుకోవాలి. ఆయనకూడా అలాగేఉండాలి. సమిష్టిగాజీవించాలమ్మా. అప్పుడు ఎక్కువ తక్కువలు మీ మధ్య చోటుచేసుకోవు. ప్రేమతో గూళ్లు కట్టుకోవాలి. ఆ గూటిని ఎండకూ వానకూ, సడలిపోకుండా కాపాడుకోవాలి. ఎంత కష్టము వచ్చినా సమిష్టిగా ఎదుర్కొండి భారంఉండదు." అన్నపూర్ణ పుష్ప బుజమ్మీదచెయ్యేసి రాస్తూ చెప్పింది.

"ఏమో నామనసంతా వికలమయిపోయింది. నాకు మళ్ళీ మీదగ్గరికి వచ్చెయ్యాలనుంది. నేనీ హోటలు భోజనం చెయ్యలేను. నాకు ఇల్లన్నా-అలంకరణ అన్నా-దానిని తీర్చిదిద్దాలన్నా ఎంత ఇష్టమో చెప్పలేను. నేను నామనసులో అందమైన మేడలు కట్టుకున్నాను అవన్నీ కూలిపోయాయి. చదువుకోకపోయినా నాలుగు ట్యూషన్లు చెప్పుకుని బతకలేనా? ఆంటీ నాకామాత్రం ఉండటానికి చోటివ్వకపోతే హోటల్లో ఉండలేనా? బతకలేనా?''

"ఛీ ఛీ అట్లా ఎందుకు అనుకుని బాధపడతావు? ఆ కన్నీళ్లు తుడుచుకో. అతడేమార్తాడు కాస్త నాలుగురోజులు ఓపికపట్టు. అంతేగాని నైరాశ్యాన్ని దరిజేరనీయకు. అదే మనిషిని కుంగదీస్తుంది. ఎందుకు బతుకుతున్నామనిపిస్తుంది. ప్రయత్నాలు చెయ్యాలి ఫలించేటట్టు చేసుకోవాలి" అన్నపూర్ణ ఓదార్చింది.

"పుష్పా, ముందుమేము తీసుకువచ్చిన టిఫిన్‌తిని మంచినీళ్ళుతాగు-పిరికిపిల్లా'' అంటూ లేవదీసి కూర్చోబెట్టి తినిపించింది హేమ.

''అలా ఏడుపుముఖం పెట్టకు. ముఖం కడుక్కుని తల దువ్వుకుని నవ్వుతూఉండు'' అంది అన్నపూర్ణ.

"ఎలా ఉండను? ఒకరివల్ల ఏమవుతుంది. రెండోవారి సహకారం ఉండాలి కదా'' లేచింది పుష్ప.

ఎప్పుడువచ్చాడో రాజు-వచ్చి గడపదగ్గరగా కూర్చున్నాడు. తలుపులు దగ్గరగావేసి ఉన్నాయి. లోపల్నించి మాటలు వినబడుతున్నాయి. మధ్య మధ్య పుష్ప ఏడుపుగొంతు వినబడుతోంది.

అతడి గుండె దడదడలాడింది. పుష్పకేంకాలేదు కద?

ఆగలేక తలుపులు మెల్లగానెట్టాడు. అన్నపూర్ణ, హేమ పక్కకు తప్పుకున్నారు. ఏడ్చి ఉబ్బినముఖంతో పుష్ప కనబడ్డది.

''పుష్పకేమయిందండి. ఏడ్చినట్టు కనబడుతోంది?" ఆదుర్దాతో అడిగాడు.

"పుష్పనడగండి వివరాలతోకూడా చెబుతుంది'' వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు.

''ఏంజరిగింది పుష్పా? ఎందుకా ఏడుపు? ఎవరేమన్నారు? లేక-ఏదయినా బాధ కలిగిందా? చెప్పు?'' చెప్పేవరకు విడిచిపెట్టలేదు.

ఏడుస్తూ అంతా ఏకరువుపెట్టింది. ''నేనేం తప్పుచేశానని నాకీశిక్ష?'' కన్నీళ్ళు తుడుచుకుంటూ అడిగింది.

''ఆఁహాఁ ఇప్పుడర్థమయింది నీ ఏడుపుకు కారణం. నేను మధ్యాహ్నం బానిస-చాకిరీ అన్నందుకే కదూ ఇదంతా నేను చిన్నప్పటినుంచీ హాస్టల్లోఉండి చదువుకున్నవాడిని. నాకు కాలేజి వాతావరణం తప్ప బైటప్రపంచం అంతగా తెలియదు విద్యార్థులనుకునే మాటల్లో ప్రపంచం ఇట్లాఉంది కాబోలన్న ఊహలు తప్ప నేను చూసినవికావు. అందులో-మా ప్రొఫెసరు ఇంట్లో ఎప్పుడు బానిస-చాకిరి-ఎక్స్ప్లాయిటేషన్ అన్నమాటలు వినబడుతూఉంటాయని విద్యార్థులు చెప్పేవాళ్ళు. అదంతా నా తలకెక్కి నేను ఆదర్శయుతంగా ఉండాలనుకునే వాడిని. నేను పగలు భోజనాలదగ్గర-తరువాతవిన్నదంతా పాతరకం అనుకున్నానుగాని, పెళ్లయితే ఇటువంటి కోరికలుంటాయనుకోలేదు. ఇప్పుడాలోచిస్తే బానిసలెవరు, ప్రభువు లెవరు? ఎంత తెలివితక్కువగా ఆలోచించాననిపిస్తోంది.

రాజు మనసు కుమిలినట్లవుతోంది. కాని పుష్పముఖంచూసి అంతలోకి తేరుకుని "పుష్పా మంచిచీరెకట్టుకుని తయారుగా. ఇవాళ మా ఫ్రెండ్ టీకి పిలిచాడు. నీవురాకపోతే ఇంట్లో దాచిపెట్టానంటాడు. కమాన్ హరియప్" అంటూ గదిలోకి వెళ్ళాడు.

మబ్బు విడిచిన చంద్రుడిలా పుష్ప అమితానందంతో అలంకరించుకోవటం మొదలు పెట్టింది.

"నేను తనమీద అధికారం చలాయిస్తున్నానని అనుకోదుకదా పుష్ప? కాదులే ఆమె మనసు తెలిసిందిగా?'' ధైర్యం తెచ్చుకున్నాడు రాజు.

ఆకాశం భూమి అనుకున్నాయి-"ఎందరు రాజులేరు? ఎందరు పుష్పలు లేరూ? నీవు కిందినుంచీ నేను పైనుంచీ చూడటంలేదూ రోజూ?''